

పొదుపు వైపు మళ్లింపు..

- కిశోర బాలికలకు కొత్త పొదుపు సంఘాలు
- 15-18 ఏళ్ల వారితో ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు
- బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేలా ప్రణాళిక
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక గ్రూపులు
- జిల్లాలో ఈనెల 30 వరకు స్పెషల్ డ్రైవ్





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మహిళల ఆర్థికాభివృద్ధికోసం ఏర్పాటైన పొదుపు సంఘాలు విజయవంతంగా ముందుకు సాగుతున్నాయి. ప్రభుత్వం బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న రుణాలు పొంది వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తూ జాతీయస్థాయి అవార్డులను సైతం అందుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వం కిశోర బాలికలను సైతం స్వయం సహాయక సంఘాల ద్వారా పొదుపు వైపు మళ్లించే దిశగా చైతన్యపరిచే చర్యలు చేపట్టింది. జిల్లాలోని 15 నుంచి 18 సంవత్సరాల వయస్సుగల బాలికలతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసే కసరత్తు ప్రారంభమైంది. జిల్లాలో సెర్ప్ ఆధ్వర్యంలో బాలికలందరికీ సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తూ ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటుచేసే ప్రక్రియ మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం 411 మహిళా గ్రామైక్యసంఘాలు ఉండగా, 1.51 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. వీటికి తోడుగా సెర్ప్ బాలికలతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సంఘాలను కూడా ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

● పొదుపు.. సామాజిక చైతన్యం

జిల్లాలోని కిశోరబాలికలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఆర్థికపరమైన భద్రత కల్పించడంతో పాటు చిన్న వయస్సులోనే ఆర్థికస్థిరత్వం లభించేలా ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్యాంకు లింకేజీల ద్వారా పొదుపు, ఆర్థిక నిర్వహణ చిన్న వయస్సులోనే అవగాహన కలగడంతో పాటు పెట్టుబడులు పెట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. 15 నుంచి 18 ఏళ్లలోపు బాలికలతో ఏర్పాటవుతున్న పొదుపు సంఘాల ద్వారా సామాజిక చైతన్యం కూడా పెరగనుంది. జిల్లాలో దాదాపు 6వేలమంది కిశోర బాలికలు ఉన్నారు. పొదుపు సంఘాలు ఏర్పాటు చేయడానికి సర్ప్ అధికారులు, సిబ్బంది అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

● దివ్యాంగులు, వృద్ధులతో ప్రత్యేక సంఘాలు

జిల్లాలో దివ్యాంగులు, వృద్ధులతో ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో స్త్రీ, పురుష బేధం లేకుండా దివ్యాంగులందరిని స్వయం సహాయక సంఘాల పరిధిలోకి తీసుకురాబోతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12243 మంది దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు కలిగి ఉన్నారు. ఇందులో ఇప్పటికే 1194మంది దివ్యాంగులు సంఘాల్లో ఉన్నారు. మిగతా 11149 మందిలో అర్హులను గుర్తించి సంఘాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 60 ఏళ్లు దాటిన మహిళలను స్వయం సహాయక సంఘాల నుంచి తొలగిస్తున్నారు. 60ఏళ్లు దాటిన మహిళలతో ప్రత్యేకంగా పొదుపు సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. వృద్ధులు తమ కుటుంబాల కోసం జీవితాంతం కష్టపడి చివరిదశలో అనేక ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. కుటుంబంలో ఎదురయ్యే అవమానాలు, విసుగు, ఆర్థిక అభద్రత, ఆరోగ్య సహకరించకపోవడం, భయం, ఒంటరితనం, భవిష్యత్తుపై ప్రణాళిక లేకపోవడం, నియంత్రణ కోల్పోవడం..

- మిగతా 8లో

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీటీవో వంశీధర్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ధ్రువీకరణ పత్రాలు లేకుండా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని సిరిసిల్ల ఇన్‌చార్జి డీటీవో వంశీధర్ హెచ్చరించారు. మండల కేంద్రం శివారులోని ఎల్లారెడ్డిపేట-మరిమడ్ల ప్రధాన రహదారిపై గురువారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఆటోలను నిలిపి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రోడ్డు పన్ను చెల్లించని కారును పట్టుకుని రూ.50వేల జరిమానా విధించామని వంశీధర్ పేర్కొన్నారు. తనిఖీలో రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడోత్సవాలతో స్నేహ సంబంధాలు పెంపు..



క్రీడాకారులతో చక్రధర్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు

ముస్తాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడోత్సవాలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను చక్రధర్‌రెడ్డితో పాటు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలను ప్రారంభించిన అనంతరం చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు స్నేహ సంబంధాలతో పాటు, నైపుణ్యత గల క్రీడాకారులను గుర్తించవచ్చన్నారు. ప్రభుత్వం విద్యారంగంతో పాటు, క్రీడారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఎంఈవో రాజిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం రాధకిషన్‌రావు, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల సత్తా..

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో క్రీడాకారులు సత్తాచాటారు. జిల్లాలోని మండలాల నుండి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అండర్-14,16,18,20 విభాగాల్లో క్రీడాకారులు(బాలబాలికలు) పోటీ పడ్డారు. విజేతలైన క్రీడాకారులకు బ్రహ్మశ్రీ డాక్టర్ కోడూరి రవీందర్‌శాస్త్రి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ బంగారు, వెండి, కాంస్య పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఈ నెల 30,31న మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కనకం శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, సాయికృష్ణ, శైలజా, సంధ్య పాల్గొన్నారు.

దేహ దానానికి అధ్యాపకుల అంగీకారం..

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ మెడికల్ కళా శాలకు ప్రభుత్వ కళాశాలలకు చెందిన అధ్యాపకులు దేహదానం (బాడీ డొనేషన్)చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ్‌రాఘనందన్ ఆధ్వర్యంలో గురువారం కళా శాల అధ్యాపకులు దేహదానం చేశారు. మరణాంతరం దేహాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు దానం చేస్తామంటూ అంగీకార పత్రంపై సంతకాలు చేసి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి జాటోత్‌కు అందించారు. అధ్యాపకులకు ప్రిన్సిపల్ రాజేశ్వరి జాటోత్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసరవేణి పర్శరాములు, చెన్నో జ్వల శశిధర్, గుమ్మడి మురళి, గుమ్మడి స్వప్న, సామాజిక కార్యదర్శ, దుంపెన రమేష్, అనాటమీ డిపార్ట్‌మెంట్ హెడ్ అన్వరున్నీస, వైద్యులు అర్పిత, దివ్య పాల్గొన్నారు.

యూరియా కొరతపై కేటీఆర్ సన్నాయి నొక్కులు..
8
గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ప్రతీక

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



గుడి చెరువులో నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న విప్, కలెక్టర్, ఎస్పీ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆలయ గుడి చెరువులో గణేష్ నిమజ్జనం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రాజన్న ఆలయ సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితేలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 27వ తేది నుంచి సెప్టెంబరు 6వ తేది వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఈ సంవత్సరం జరగనున్నాయని, వీటికి తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది పోలీస్ శాఖ ద్వారా సుమారు 300 రిజిస్ట్రేషన్ చేసుకుని, 100 రిజిస్ట్రేషన్ లేకుండా.. మొత్తం 400 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు తెలిపారు. ఈసారి విగ్రహాల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. నిమజ్జన సమయంలో ఇబ్బందులు రాకుండా అవసరమైన పెద్ద క్రేన్లు ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ గుడి చెరువులో నిమజ్జనం భక్తిభావంతో జరిగేలా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. నిమజ్జనం సందర్భంగా డీజే, క్రాకర్స్‌కు అనుమతి ఇవ్వవద్దని అన్నారు. లైటింగ్ తాగునీరు సరఫరా, బారికేడ్లు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన మేర గజఈతగాళ్లను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రతి పాయింట్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు అన్ని శాఖల అధికారులతో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని సూచించారు.

మండపాల వివరాలను నమోదు చేసుకోవాలి

వేములవాడ పట్టణంలోని గణేష్ మండపాలలోని విగ్రహాలకు జీపీఎస్ జియోట్యాగింగ్‌తో సహా మండపాల వివరాలు తప్పకుండా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అన్నారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలని, గణేష్ విగ్రహం నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, అవసరమైన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. పాయింట్ల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని, కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి గణేష్ విగ్రహానికి టోకెన్ అందించి, వాటి మూమెంట్ మానిటరింగ్ చేయాలన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో పండగ వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మహేష్ బీ గితే మాట్లాడుతూ నిమజ్జనం సమయంలో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా రూట్‌మ్యాప్ ఫైనల్ చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎక్కడా కూడా వైన్స్ అమ్మడానికి వీలు లేదని, బెల్టు షాపుల వద్ద సైతం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పెద్ద విగ్రహాల తరలింపు రూట్‌లను ముందుగా పరిశీలించ, అక్కడ ఎటువంటి కేబుల్ వైర్ ఇంటర్నెట్ వైర్స్, విద్యుత్ తీగలు అడ్డు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో రాధాబాయి, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, జిల్లా ఫైర్ సర్వీస్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ, సెస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి

- త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



కాంగ్రెస్‌లో చేరిన కృష్ణాదేవరావుకు కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి దయాకర్

సిరిసిల్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలతో కలిసి ఓట్ చోరీపై రాహుల్ గాంధీ ప్రసంగాన్ని వీక్షించారు. రుద్రవరం సింగిల్‌విండో చైర్మన్ రేగులపాటి కృష్ణాదేవరావు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. యూరియాపై కేటీఆర్ ప్రభుత్వానికి కావాలనే బదునాం చేస్తున్నారని 10సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీస సోయి లేకుండా మాట్లాడుతున్నారన్నారు. యూరియా సరఫరా కేంద్రం పరిధిలోకి వస్తుందని కానీ కేటీఆర్ బీజేపీపై ఎలాంటి ఆరోపణలు చేయకుండా కేవలం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకే సపోర్ట్ చేస్తా అన్న చందాన మాట్లాడారని తెలిపారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా రాజకీయ చైతన్యానికి ప్రతీక అన్నారు. పీసీసీ పదవుల కోసం తీసుకున్న అప్లికేషన్లలో రాష్ట్ర వ్యాప్తంగా సిరిసిల్ల జిల్లా పరిధిలో సుమారు 1700లు వచ్చాయని తెలిపారు. రానున్న రోజుల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కళ్ళలో పెట్టుకొని చూసుకుంటామని రాబోయే ప్రతి ఎన్నికల్లో వారికి గెలుపులో మేము భాగస్వామ్యం అవుతామన్నారు. కార్యకర్తల శ్రమఫలితంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పదవుల్లో మహిళలకు కూడా పెద్ద పీట వేస్తామన్నారు. కొత్తపాత అని తేడా లేకుండా అందరికీ అవకాశాలు వస్తాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కలిసి రాష్ట్రంలో ఓటు చోరీ చేశాయన్నారు. దానికి నిదర్శనమే 2018 ఎన్నికల్లో మేము ఓడిపోవడానికి కారణమని ప్రస్తుతం గత ఎన్నికల సుప్రీం కోర్టులో కేసు ఇంకా నడుస్తుందన్నారు. షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఎన్నికలను మోదీ అనుమతితో కేసీఆర్ ఒక సంవత్సరం ముందుగానే జరిపి ఓటు చోరీని టెస్టు చేశారన్నారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రతిపక్షాలు ఎక్కడ బలంగా ఉన్నాయో అక్కడ ఓట్ల చోరీ చేస్తూ తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయన్నారు. మొన్నటి ఎన్నికల్లో చావు తప్పిలొట్ట పోయినట్లుగా సీట్లతో ఇతరుల సపోర్ట్‌తో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటయ్యిందని, కేంద్రంలో చంద్రబాబు నితీష్ కుమార్ తోక జాడిస్తే పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలన్నారు. కేటీఆర్ ఓట్ల చోరీపై మాట్లాడకుండా యూరియా కొరతపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో 8ఎమ్మెల్యే సీట్లు గెలిచిన బీజేపీ ఎంపీ ఎన్నికల్లో 8 సీట్లు గెలిచిందని, 36 ఎమ్మెల్యే సీట్లు గెలిచిన బీఆర్ఎస్ సున్న సీట్లకే ఎలా పరిమితమైందని ప్రశ్నించారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ అధికారంలో ఉండి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, కేసీఆర్ ఉండగా కేటీఆర్, హరీష్‌రావు కవిత ముఖ్యమంత్రి పీఠం కోసం తమలో తమ కొట్టుకుంటున్నారని నేనేమి తక్కువ అన్నట్లు నాలుగో సింహం సంతోష్‌రావు కూడా పోటీ పడుతున్నారన్నారు. తెలంగాణ పదాన్ని పార్టీ నుంచి తొలగించిననాడే తెలంగాణ ప్రజలతో పేగు బంధం తెగిపోయిందన్నారు. రాష్ట్రంలో ఏం చేయలేని కేసీఆర్ బీఆర్ఎస్ పేరుతో దేశాన్ని దోచుకోవాలని చూశారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సివిల్, ట్రాఫిక్ చలాన్ల కేసులు త్వరగా పరిష్కారం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్



మాట్లాడుతున్న రాధిక జైస్వాల్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : న్యాయస్థానంలో పెండింగ్ ఉన్న సివిల్ ట్రాఫిక్ చలానులతో పాటు ఇతరత్రా కేసులు త్వరగా పరిష్కారమవుతున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక జైస్వాల్ మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరగా పరిష్కారం చేయడం వల్ల సమయం, డబ్బులు ఆదా అవుతున్నాయన్నారు. ట్రాఫిక్ చలాన్లు ఉన్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సెప్టెంబర్13న జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ చింతోజీ భాస్కర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా జడ్జి పీ నీరజ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న నిర్వహించే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి పి. నీరజ అన్నారు. గురువారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులని పరిష్కరించాలని కోరారు. రాజీకి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, బ్యాంకు పీఎల్‌సీలు, ఎక్సైజ్ కేసుల వివరాలు అందజేయాలన్నారు. రాజీ మార్గం ఉన్న కేసులపై మధ్యవర్తిత్వం ద్వారా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో 1వ అదనపు సెషన్స్ జిల్లా న్యాయమూర్తి పుష్పలత, సీనియర్ సివిల్ జడ్జిలు లక్ష్మణచారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్, జూనియర్ సివిల్ జడ్జిలు ఏ. ప్రవీణ్, సృజన, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటిలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మహేష్ బీ గితే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బి.గితే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులతో ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లు సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలను గుర్తించి భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. గణేష్ మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి సరఫరా చేసే వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. సెప్టెంబర్ 13న జరిగే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

చందుర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నానో టెక్నాలజీ అనేది సైన్స్, ఇంజనీరింగ్ కలబోతని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అఫ్జల్ బేగం పేర్కొన్నారు. నానో యూరియా ఉపయోగంపై రైతులకు చందుర్తి మండలం మూడపల్లి రైతు వేదిక క్లస్టర్‌లోని రైతులకు నానో యూరియా వినియోగించడంవల్ల కలిగే ప్రయోజనాలను గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిణామం మారదు కానీ ఉపరితల వైశాల్యం పెరుగుతుందన్నారు. ఎక్కువ ఉపరితల వైశాల్యం అంటే ఆకు ఉపరితలంపై ఎక్కువ చర్య అని, దీనివల్ల ఎక్కువ పీల్చుకోవడం (శోషణ) జరుగుతుందన్నారు. దీంతో మెరుగైన పంట ఉత్పాదకత లభిస్తుందన్నారు. నానో యూరియా వాడకం వల్ల పంటల దిగుబడి పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. నానో యురియాను రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. ఎకరానికి అర లీటరు సరిపోతుందన్నారు. అనంతరం ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో మూడపల్లికి చెందిన రైతు నారాయణ వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ సహాయంతో నానో యూరియా పిచ్చికారి చేశారు. ఏడీఏ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారిని అనూష, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవీణ్, ఇఫ్కో మేనేజర్ నరేష్, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం కల్వర్టును ఢీకొని ఒకరి మృతి


తోట మల్లారెడ్డి(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తోట మల్లారెడ్డి(60) మృతి చెందాడు. రామడుగు మండలం వెంకట్రావుపల్లి నుంచి పెద్దపల్లి వైపు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎస్‌ఆర్‌ఎస్‌పీ ఉప కాలువ ఎల్ పైన నిర్మించిన కల్వర్టును ఢీకొని మల్లారెడ్డి కాలువలో పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటువైపు వెలుతున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుమారుడు రిషికేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కోతుల దాడిలో ఉపాధ్యాయుడికి గాయాలు

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కోతులు దాడి చేశాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులపై కోతులు దాడి చేయడానికి ప్రయత్నించాయి. గమనించిన ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ కర్రతో కోతులను అడ్డుకునేందుకు వెళ్లగా ఒక్కసారిగా ఆయనపై దాడి చేశాయి. దీంతో సంపత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇద్దరికి గాయాలు

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆటో నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరిని గాయపర్చిన ఆటో డ్రైవర్ నెల్లుట్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. బుధవారం రాత్రి తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి నాగరాజు నడుచుకుంటూ వెళ్తుండగా బద్దనపల్లి శివారులో ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో నాగరాజుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న నాగరాజు గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడ్డ వారు ఆటోడ్రైవర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోర్టులో హాజరు పరుచగా గురువారం వారికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి జరిమానా విధిస్తూ పెద్దపల్లి కోర్టు జడ్జి సునిత తీర్పు ఇచ్చినట్లు రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు. జూలై 2020లో ఇద్దరు వ్యక్తులు నిజామాబాద్‌లోని గుర్తు తెలియని వ్యక్తి నుంచి 2 కిలోల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ప్యాకెట్‌ను రూ. 150 నుంచి 200 వరకు బొంపల్లిలో విక్రయిండగా అప్పటి బసంత్‌నగర్ ఎస్ఐ జానీపాష వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరువురిపై నేరం రుజువు కావడంతో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, 5 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. నేరస్తులకు శిక్షపడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్, పోలీసు అధికారులు కీలక పాత్ర పోషించారు.


కరీంనగర్‌లో మండపానికి తరలుతున్న గణనాథుడు

విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహం

ఉత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకుందాం

వినాయకుల విగ్రహాల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గణేశ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులు వచ్చాయంటే అందరిలో ఉత్సాహం నెలకొంటుంది. రోజురోజుకు విగ్రహాల పరిమాణం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తరలింపులో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ యేడు విగ్రహాలు విద్యుత్ తీగలకు తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ శాఖ సిబ్బందికి, మండపాల నిర్వా హకులకు పలు సూచనలు చేశారు.

- విగ్రహాల ఎత్తుని బట్టి రూట్‌ని నిర్ణయించుకోవాలి. ఎక్కడైనా సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి
- విద్యుత్ లైన్లకు కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్ లో ప్రవహించే విద్యుత్ సరఫరా ప్రభావం, ఇండక్షన్ రెండు అడుగుల వరకు ఉంటుంది .
- ఎత్తైన విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలి
- మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకోరేషన్లను వీలైనంత వరకు తగ్గించాలి.
- మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కవద్దు. విద్యుత్ సిబ్బంది ద్వారానే కనెక్షన్ పొందాలి.
- ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలి. ఎలాంటి జాయింట్ వైర్లు వాడరాదు. తగినంత కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పనిసరిగా వాడాలి. ఇది విద్యుత్ ప్రమాదాల నుండి రక్షణ ఇస్తుంది.
- మండపాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు పరిసరాలను క్షుణ్ణంగా పరి శీలించాలి. విద్యుత్ వైర్లు, పోల్స్, ఇతర ప్రమాదకర విద్యుత్ పరికరాల నుండి పిల్లల్ని దూరంగా ఉంచాలి.
- ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే వారికి వెంటనే వైద్య సహాయం అందించి, ఆ ప్రమాదం గురించి దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- వైరింగ్‌లో ఎక్కడైనా లీకేజీ ఉంటే, వర్షాలు కురిసినప్పుడు తేమ వలన విద్యుదాఘాతం తగిలే అవకాశమున్నది. మండపాల నిర్వాహకులు ప్రతి రోజు తప్పనిసరిగా వైరింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆర్టీసీ బస్సు కిందపడి ఇద్దరు విద్యార్థులకు గాయాలు


గాయపడ్డ అభిషేక్

మానకొండూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు కింద పడి ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని చెంజర్లకు చెందిన అశ్విక్‌తేజ, అభిషేక్ పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో చదువుతున్నారు. గురువారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో పోచంపల్లి పాఠశాల వద్ద ఆదర్శ పాఠశాలకు కేటాయించిన బస్సులో ఎక్కుతుండగా అశ్విక్‌తేజ, అభిషేక్‌లు బస్సు వెనుక టైర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. 108కు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై క్రాంతికుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన అమ్మిగల అనిల్ సెల్‌ఫోన్ 2023 మార్చి 3న బొమ్మకల్ గ్రామంలో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ లొకేషన్‌ను గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. బాధితుడు అనిల్‌కు గురువారం కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అప్పగించారు.

ఇల్లందకుంట : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఇల్లందకుంట మండలానికి చెందిన జక్కుల దేవేందర్ ఇటీవల తన మొబైల్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి ఎస్ఐ క్రాంతి కుమార్ బాధితుడికి తిరిగి అందజేశారు. ఈ మేరకు బాధితుడు దేవేందర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన ముగ్గురితోపాటు అనుమానాస్పదంగా తిరుగుతున్న మరో ముగ్గురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న గొల్లపల్లికి చెందిన కె.ఆంజనేయులు, కె.తిరుపతి, డి.సంపత్‌ను, బొమ్మకల్‌లో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరిగిన కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రమేష్, ఏసు, నాగరాజును గురువారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.74 లక్షల మోసం

- ముగ్గురు సైబర్ నేరస్థుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు పాల్పడుతున్న కర్ణాటకకు నాగేంద్ర ప్రసాద్, యోగేష్ కదం, సునీల్ అనే ముగ్గురు నేరస్థులను గురువారం సైబర్ క్రైం, జగిత్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం వివరాలను వెల్లడించారు. సైబర్ నేరస్థుల మాటలు నమ్మి జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల పట్టణాలకు చెందిన ఇద్దరు బాధితులు బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్‌లో విడతల వారీగా రూ.74 లక్షలు పెట్టి మోసపోయారు. అనంతరం బాధితులు జగిత్యాల సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. దీంతో కోరుట్ల సీఐ సురేష్, బుగ్గారం ఎస్సై సతీష్, సైబర్ క్రైం ఎస్సైలు కృష్ణ, దినేష్ కుమార్‌లు స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. సైబర్ మోసానికి పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. నిందితులు కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లోని శ్రీనివాసపురంకు చెందిన నాగేంద్రప్రసాద్, ఉత్తర బెంగళూర్‌లోని దశరథాశికి చెందిన యోగేష్ కదం, నార్త్ బెంగళూర్‌లోని హెన్నూర్ క్రాస్‌కు చెందిన సునీల్‌లుగా గుర్తించారు. నిందితులు బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాలతో పాటు స్టాక్ మార్కెట్, బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాలను గుర్తించారు. ముగ్గురు నిందితులు కలకత్తాలో ఓ ముఠా ద్వారా ట్రాన్‌జాక్షన్ చేస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేశారు. ఇందులో నాగేంద్ర ప్రసాద్ సులువైన మార్గాల ద్వారా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో కలకత్తాలోని గ్యాంగ్ సభ్యులతో కలిసి ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్ లావాదేవీలు చేయించి ప్రజలను మోసగించి వచ్చిన డబ్బులను ఇతర ఖాతాలకు బదిలీ చేస్తున్నట్లు గుర్తించారు. సైబర్ నేరస్థుడు నాగేంద్ర ప్రసాద్‌పై దేశ వ్యాప్తంగా 71 కేసులు నమోదైనట్లు గుర్తించారు. మొబైల్‌తో పాటు బ్యాంక్ ఖాతాల పుస్తకాలు, చెక్ బుక్కులను జగిత్యాల జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే యోగేష్ కదం, సునీల్‌లు ఇతరుల పేర్లతో బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులను జల్సాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దేశ వ్యాప్తంగా యోగేష్ కదం, సునీల్‌పై 22 కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు.

వీధి కుక్కలను చంపుతున్నారని పోలీసులకు ఫిర్యాదు

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు వీధి కుక్కలను చంపుతున్నారంటూ స్త్రే ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనే ఎన్‌జీఓ ప్రతినిధి ముదావత్ ప్రీతి బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దుర్గానగర్ వద్ద కొందరు వ్యక్తులు కుక్కలను ఒక వ్యాన్‌లో తరలిస్తున్నారని, అందులో రెండు కుక్కలు చనిపోయాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను ఓ మాజీ కార్పొరేటర్ అడ్డుకున్నాడని ఫిర్యాదులో తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేములవాడలో శిథిలాల తొలగింపు

- వేగవంతంగా రోడ్డు విస్తరణ పనులు


వేములవాడలో శిథిలాలను తొలగిస్తున్న యంత్రాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ. 47 కోట్లతో మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు గత రోడ్డును 80 ఫీట్లకు విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపుల 254 ఇండ్లను తొలగించేందుకు నిర్ణయించి నిర్వాసితులకు పరిహారం అందజేశారు. దీంతో గత రెండు నెలలుగా భవనాలను కూల్చివేసిన శిథిలాలు, మట్టి తొలగించకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల శిథిలాలను తొలగించేందుకు రూ. 22 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేపడుతున్నాడు. శిథిలాలు, మట్టిని వేగంగా తరలిస్తూ విస్తరణ పనులు చకచక నడుస్తున్నాయని పట్టణ వాసులు చెబుతున్నారు. వ్యర్థాల తొలగింపుతో రోడ్డు వెడల్పు కనిపించడంతో భక్తులు, పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మానేరు వద్ద జన సందడి


మానేరు వద్ద అహ్లాదంగా గడుపుతున్న జనం

గంభీరావుపేట, ఆగస్ట్ 21 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం వద్ద జనసందడితో కిటకిటలాడుతోంది. మానేరు ప్రాజెక్టు మత్తడి దూకుతుడటంతో సందర్శకులు వస్తున్నారు. ప్రాజెక్టు పరవళ్లను తిలకించేందుకు మానేరు పరిసరాలకు పర్యాటకులు ఉత్సహంగా విచ్చేస్తున్నారు. దీంతో మానేరు ప్రాంతం సందర్శకులతో సందడిగా మారింది.

నీటిసంపులో పడిన ఆవు

- రక్షించిన ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని దోబివాడలో బుధవారం రాత్రి ఓ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో ఆవు ప్రమాదవ శాత్తు పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును రక్షించేందుకు ప్రయత్నించారు. సాధ్యంకాక పోవడంతో వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బందితో పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆవును రక్షించారు.


సంపులో పడిన ఆవు

కారులో వచ్చి నగదు చోరీ

- బైక్ నుంచి రూ.1.9 లక్షలు దొంగిలించిన మహిళలు

జమ్మికుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు కారులో వచ్చిన ఇద్దరు మహిళలు కళ్లు మూసి తెరిచే లోపు ఓ ద్విచక్ర వాహనం నుంచి నగదు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరి శ్యామ్‌రెడ్డి తన భార్యతో పాటు ద్విచక్ర వాహనంపై జమ్మికుంట పట్టణానికి వచ్చాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1.9 లక్షల రూపాయలు విత్ డ్రా చేసుకుని తన ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి తన భార్యను ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కించాడు. అనంతరం పాత వ్యవసాయ మార్కెట్ దగ్గర ఉన్న నందిని కిరాణం ఎదుట ద్విచక్ర వాహనం పెట్టి లోనికి వెళ్లాడు. ఆ షాపులో కావల్సిన సామగ్రి లేక పోవడంతో పక్క షాపులోకి లోకి వెళ్లాడు. అందులో కావాల్సిన సామాగ్రి తీసుకున్నాడు.


సీసీ కెమెరాలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళలు

అప్పటికే నంబర్ ప్లేట్ లేని ఓ కారులో ఇద్దరు మహిళలు అతడిని అనుసరిస్తున్నారు. అదును చూసి ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో ఉన్న నగదును తీసుకోని ఏం తెలియనట్లు అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లి కారు వెనుకాల సీట్లలో కూర్చున్నారు. అప్పటికే స్టార్ట్ చేసి ఉన్న కారులో పరారయ్యారు. ఇదంతా తెలియని బాధితుడు తన ద్విచక్ర వాహనం వద్దకు వెళ్లి ముందు బ్యాగును పరిశీలించగా ఖాళీగా కనిపించింది. దీంతో కంగుతిన్న అతడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

చోరీ ఘటన సీసీ కెమెరాలో నమోదైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన ట్రాఫిక్ ఎస్సై


గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ హరిశేఖర్

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లో గురువారం పెద్దపల్లి నుంచి మంచిర్యాల వైపునకు వెళుతున్న రన్నింగ్ ఆటో నుంచి ఒక వ్యక్తి జారి కిందపడ్డాడు. అతనికి తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్ అతన్ని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మానవతా దృక్పథంతో క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ హరి శేఖర్‌ను ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ రాజేశ్వర్‌రావు అభినందించారు.

బీర్‌పూర్ పెద్దగుట్టపై వరదపాశం

- పెద్దగుట్టలో లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బీర్‌పూర్,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలకేంద్రం శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ సమీపంలోని పెద్దగుట్టపై వెలసిన స్వామి వారికి గురువారం వరదపాసం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దగుట్టపై వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం బీర్‌పూర్ గ్రామంలోని నాయకులు, రైతులు, అర్చకులు, ఆయా గ్రామాల ప్రజలు గ్రామ శివారులోని పెద్దగుట్ట వద్దకు కాలినడకన చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దగుట్ట ఆలయ చరిత్రను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా వరదపాసం నిర్వహనకు, అన్నదానం కార్యక్రమాలకు పలువురు దాతలు తమ వంతుగా ఆర్థిక సహాయ హకారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు పెద్ద సంతోష్ కుమార్, మధు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


బీర్‌పూర్ పెద్ద గుట్టపై వరద పాశం పోస్తున్న అర్చకులు

జాతీయస్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని షిరిడీలో ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శ్రీపాల్‌రెడ్డి, కొరిమి సంతోష్‌కుమార్, పెద్దపల్లి జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సంపత్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 15 సంవత్సరాల విభాగంలో ఆర్ .విష్ణువర్ధన్, ఎ.లక్షిత్ రాజ్, బి.హర్షవర్ధన్, 17 సంవత్సరాల విభాగంలో కె.అరవింద్, ఈ.శ్రీధర్, టి.రిత్విక్, టి.అవినాష్, జి.సుజిత్ కుమార్, పెద్దపల్లి జిల్లా నుంచి 15 సంవ త్సరాలు విభాగంలో ఇ.అవినాష్ రావు, అండర్-17 విభాగంలో విశ్వనాథ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, మహ్మద్ కరీం, ప్రైవేట్ పీఈటీ బాధ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గౌతమ్ హర్షం వ్యక్తం చేశారు.


ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు..

కోనరావుపేట: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మండల విద్యార్థి ఎంపికైనట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామానికి చెందిన లకావత్ ఆరాధ్య ఎస్ఏటిజి అకాడమీ విద్యార్థి ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్ 15 క్రీడల్లో ప్రతిభ కనపరచగా జాతీయస్థాయి క్రీడకి ఎంపికైనట్లు తెలిపారు. పూణేలో ఈ నెల 25న జరగనున్న వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు.


ఆరాధ్య


సాయిచరణ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగు సాయిచరణ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో పదవతరగతి చదువుతున్న సాయిచరణ్ సిరిసిల్లలో గురువారం జరిగిన పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఎంపికయ్యాడు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నాడు.

రాజన్న ఆలయంలో వృద్ధుడి అస్వస్థత

● ఆసుపత్రికి తరలించిన ఆలయ ఉద్యోగులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఓ భక్తుడు అస్వస్థతకు గురయ్యాడు. రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వస్తున్న వృద్ధుడు హఠాత్తుగా ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు.


వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ ఉద్యోగులు

ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

● అర్హులకు అందడం లేదని పలువురి ఆందోళన

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ ముస్లిం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లు పంపిణీ కోసం గతంలో దరఖాస్తులు స్వీకరించగా గురువారం మైనార్టీ శాఖ అధికారులు అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో మైనార్టీ పాఠశాల అవరణలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తుండగా అర్హులైన తమకు ఎందుకు ఇవ్వడం లేదని కొంత మంది మహిళలు అధికారులను నిలదీశారు. ఏడాది క్రితం దరఖాస్తులు చేసుకున్నామన్నారు. మిషన్ తీసుకోవడానికి రావాలని మైనార్టీ కార్యలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. పంపిణీ కేంద్రం దగ్గరికి వస్తే అర్హుల జాబితాలో పేరు లేదని చెప్తున్నారన్నారు. అర్హుల జాబితాలో పేరు లేకుంటే మమ్మల్ని ఎందుకు రమ్మన్నారని అధికారుల తీరుపై మహిళలు మండి పడ్డారు. అర్హులైన తమకు కూడా కుట్టు మిషన్లు అందించాలని డిమాండ్ చేశారు. విషమయంపై వివరణ కోసం మైనార్టీ అధికారులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా స్పందించలేదు.



యశస్వీ భవ

ఓబీసీ, ఈబీసీ విద్యార్థులకు పీఎం యశస్వీ స్కాలర్‌షిప్‌లు

● ఉన్నత విద్య కోసం రూ. రెండు లక్షల వరకు ఉపకార వేతనం

● దరఖాస్తుకు ఈ నెల 27 వరకు గడువు

చొప్పదండి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం యశస్వీ పథకాన్ని తీసుకువచ్చింది. ఉన్నత విద్య అభ్యసించలేని ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ అందించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ ద్వారా ఈ స్కాలర్‌షిప్‌లను అందజేయనుంది. స్వయం ప్రతిపత్తి, ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు లభించనున్నాయి. హాస్టల్ వసతి ఖర్చుల కోసం ప్రతి నెల మూడు వేల రూపాయల వరకు చెల్లించనున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికిగాను పీఎం యశస్వీ పథకం కింద విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

● **నవంబరు వరకు స్కాలర్‌షిప్‌లు మంజూరు**

పీఎం యశస్వీ(పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీం ఫర్ వైబ్రెంట్ ఇండియా) పథకం కింద టాప్‌క్లాస్ విద్యాసంస్థల ఫీజులు, హాస్టల్ ఫీజులను విద్యార్థులకు అందజేస్తారు. ఎన్ఐటీ, ఐఐటీ, నిఫ్ట్, ఐఐఐటీ, ఇష్లాతోపాటు ఇతర టాప్‌క్లాస్ విద్యాసంస్థలలో చేరే విద్యార్థులకు గరిష్టంగా రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రెండు లక్షలలోపు ఉండాల్సి ఉంది. ఈ పథకం కింద రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలకు 400కుపైగా స్లాట్‌లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. స్లాట్లు, దరఖాస్తుల ఆధారంగా నవంబర్ వరకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయనున్నారు. దీనికి ఎలాంటి అర్హత పరీక్ష లేదు. స్కాలర్‌షిప్‌లలో 30 శాతం బాలికలకు కేటాయిస్తారు.

● **దరఖాస్తు ప్రక్రియ ఇలా...**

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఎన్ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్), ఎన్‌టీఏ, scholarships.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. తర్వాత విద్యార్థికి ఒక ఐడీని కేటాయిస్తారు. ఆ ఐడీ ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థి స్కాలర్‌షిప్ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 27 చివరి తేదీకాగా, చేసుకున్న దరఖాస్తుల్లో లోపాలను సవరించుకునేందుకు సెప్టెంబరు 15 వరకు అవకాశం కల్పించారు.

వైభవంగా సామూహిక లక్ష బిల్వార్చన


పూజా కార్యక్రమంలో భక్తులు

ఓదెల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం అర్చకులు వీరభద్రయ్య ఆధ్వర్యంలో సామూహిక లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. యేటా నిర్వహించే మాదిరిగా లోక సంరక్షణార్థమై 180మంది దంపతులతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. శ్రావణమాసం విశిష్టత, బిల్వార్చన ప్రాధాన్యతను ఈ సందర్భంగా అర్చకుడు భక్తులకు వివరించారు. బిల్వార్చనతోపాటు ఏకాదశ రుద్రాభిషేకం, సహిత రుద్రాహావణం, మంగళహారతి మంత్రపుష్పం నిర్వహించారు. గర్భగుడిలో కొలువుదీరిన శేషాలింగేశ్వరునికి భక్తులు బిల్వపత్రిని సమర్పించారు. గోదావరిఖనికి చెందిన కన్నూరి రాజమల్లు,సుగుణ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై డీఎల్పీవో విచారణ

శంకరపట్నం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలో ఇంటి నిర్మాణంపై హుజూరాబాద్ డీఎల్పీవో శ్రీనివాస్ గురువారం విచారణ చేపట్టారు. కరీంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో వనపర్తి అయిలయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తుండగా గ్రామపంచాయతీ స్థలం ఆక్రమించాడని వనపర్తి హరీష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హుజూరాబాద్ డీఎల్పీవో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు హరీష్‌తో పాటు గృహ నిర్మాణం చేపడుతున్న వనపర్తి అయిలయ్య వాంగ్మూలాలు తీసుకున్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని డీఎల్పీవో శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట ఎంపీవో ప్రభాకర్ ఉన్నారు.

24న జనహిత పాదయాత్ర

- ఉప్పరమల్యాల నుంచి గంగాధర వరకు..
- 25న ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం,
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల గ్రామం నుంచి కురిక్యాల చౌరస్తా మీదుగా గంగాధర వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్ర ఈనెల 24న నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం డీసీసీ కార్యాలయంలో మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు, అనుబంధ సంఘాలకు, పార్టీ అభిమానులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. యాత్రను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమన్వయ పరుస్తారన్నారు. 24వ తేది సాయంత్రం పాదయాత్ర తరువాత గంగాధరలో బస ఉంటుందన్నారు. 25వ తేది ఉదయం ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ పాల్గొంటారని తెలిపారు. మహిళా సంఘాలతో మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. అనంతరం జిల్లా ముఖ్య కార్యకర్తలతో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ ఇష్టాగోష్టి నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 24న సాయంత్రం 4 గంటలకు గంగాధర మం డలంలో జనహిత పాదయాత్ర ఉంటుం దన్నారు. ఈ పాదయాత్రలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలంతా పాల్గొంటారన్నారు.

● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు భరోసా ఇస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుని సక్షేమాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమావేశంలో ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఆకుల నర్సన్న, రాజిరెడ్డి, పులి అంజనేయులు, శ్రావణ్‌రాయక్, దన్నా సింగ్, బోనాల శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొన్న ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మక్కాన్ సింగ్

కవ్వంపల్లికి మంత్రి పొన్నం పరామర్శ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం బుధవారం అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం కరీంనగర్‌లో పరామర్శించారు. కవ్వంపల్లి రాజేశం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.


ఎమ్మెల్యే కవ్వంపల్లితో మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● మాస శివరాత్రి సందర్భంగా మహాలింగార్చన


భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రద్దీ కొనసాగుతోంది. గురువారం ఉదయం ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకొని పరివారం దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు.

మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు

శ్రీరాజరాజేశ్వర స్వామివారికి మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం 5.30గంటల నుంచి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. స్వామివారికి కల్యాణ మండపంలో రుద్రహవనం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 6.05 గంటలకు అద్దాల మండపంలో మహాలింగార్చన నిర్వహించగా, ఆలయ ఈవో రాధాబాయితో పాటు భక్తులు హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కులధ్రువీకరణ పత్రంలో నో కరెక్షన్

● ఆప్షన్ లేకపోవడంతో అయోమయం

ధర్మారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రంలో కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో బాధితులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో మీ సేవలో కమ్యూనిటీ అండ్ డేట్ ఆఫ్ బర్త్ పేరుతో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారు. క్యాస్ట్ సర్టిఫికెట్‌లో కులంతోపాటు పుట్టిన తేదీ వివరాలు ఉన్నా రెవెన్యూ అధికారులు కేవలం కులం సర్టిఫికెట్‌ను మాత్రమే మంజూరు చేసేవారు. దాదాపు నెల రోజుల క్రితం కుల ధ్రువీకరణ పత్రం విషయంలో డేట్ ఆఫ్ బర్త్ ఆప్షన్ తీసివేసి కేవలం కమ్యూనిటీ సర్టిఫికెట్ అని వచ్చేలా ప్రభుత్వం అప్‌డేట్ చేసింది. ఈ అప్‌డేట్ విద్యార్థులకు శాపంగా మారింది.

ఉదాహరణకు ఒక వ్యక్తి కులం సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోగా అతను ఇంతకు ముందు ఎన్ని సార్లు కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నారో దానికి సంబంధించిన పూర్తి వివరాలు చూపిస్తుంది. అందులో నుంచి చివరగా తీసుకున్న సర్టిఫికెట్‌ను మాత్రమే అతను రీ ప్రింట్ తీసుకోవచ్చు కాని కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వీలులేదు. ఇంతకు ముందు కుల ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకోని వారు అప్లై చేసుకుంటే దరఖాస్తు తీసుకునేలా వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారు.

కొందరికి మేలు..

గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తరచూ ఆఫీసు చుట్టూ తిరగకుండా వచ్చిన పాత డేటానుంచే సులభంగా కుల ధ్రువీకరణ పత్రం పొందుతున్నారు. అయితే గతంలో జారీచేసిన కులం సర్టిఫికెట్స్‌లో తప్పులు దొర్లినవారికి కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో నానాతంటాలు పడుతున్నారు. ఇలాంటివారికి కొత్తగా దరఖాస్తుకు, కరెక్షన్‌కు అవకాశంలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు, కాలేజీ స్టూడెంట్స్, స్కాలర్‌షిప్‌కోసం అవసరమున్న వారు, కల్యాణలక్ష్మి దరఖాస్తు చేసుకునేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కమ్యూనిటీ సర్టిఫికెట్‌కు కరెక్షన్‌ఆప్షన్ కల్పించాలని కోరుతున్నారు.


కుల సర్టిఫికెట్‌లో తప్పు సరిదిద్దాలని కోరుతున్న బాధితుడు

ఏం చేయాలో అర్థం కావడం లేదు..

- నునావత్ అరుణ్ నాయక్ , (లంబడితండా బి గ్రామం)

నా పేరు నునావత్ అరుణ్ నాయక్, మాది లంబడితండా బి గ్రామం. నేను ఆర్మీకి సెలెక్ట్ అయ్యాను. నాకు వచ్చే నెలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంది. ఇంతకు ముందు తీసిన కులం సర్టిఫికెట్‌లో నాపేరు అరుణ్ నాయక్‌కు బదులు అరుణ్ అని పడింది. కొత్తగా కులం సర్టిఫికెట్‌కు మీ సేవకు వెలితే పాత సర్టిఫికెట్ వస్తుంది. పాత సర్టిఫికెట్‌ను కరెక్షన్ ఆప్షన్ లేదు అంటున్నారు. దీంతో ఏం చేయాలో నాకు అర్థం కావడం లేదు. సంబంధిత అధికారులే నాకు న్యాయం చేయాలి.

ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 1,39,255 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 75.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 49.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలు వలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 29,532 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 651 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మూడు, నాలుగు రోజులుగా భారీగా వరద వస్తుండడంతో గేట్లు ఎత్తి దిగువ గోదావరికి నీటిని విడుదల చేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఈనెల న ఉదయం 6 గంటల నుంచి గేట్లు మూసి వేశారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

● **ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద**

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం ప్రాజెక్టు నుంచి 3,600 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ నుంచి 26,000, వాగులు, వంకల నుంచి 47500 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నందున గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 15 గేట్లు ఎత్తి లక్ష 16వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 19.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది..

● మంథనిరూరల్: మండలంలోని సిరిపురం సమీపంలోని సుందిళ్ల బ్యారేజీలో వరదగురువారం సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టింది. బ్యారేజీ నుంచి 26 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారు.

● **గాయత్రి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల**

రామడుగు: రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు.

● బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నీటితో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రం వరకు 18,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. వరద కాలువ ద్వారా 14,800, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 3,150, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.17 ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 15.97 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

● **అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు**

ఇల్లంతకుంట: మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు ఉంది. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టుకు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● **ఎగువ మానేరు పరవళ్లు**

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరవళ్లు కొనసాగుతున్నాయి. పల్వంచ, కూడవెళ్లి వాగుల నుంచి వరద నీరు వస్తుండడంతో జలాశయం మత్తడి దూకుతోంది. మానేరు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 2202 క్యూసెక్కులుగా కొనసాగుతోంది.

మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు

● ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ● ఎల్లారెడ్డిపేటలో ఉత్సాహంగా తీజ్


తీజ్ వేడుకల్లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్, అధికారంలో గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడంతో పాటు త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు దక్కే అవకాశాలున్నాయని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ అన్నారు. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా తీజ్ వేడుక నిలుస్తోందన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గిరిజనులు గురువారం తీజ్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు ఎల్లారెడ్డిపేట మీదుగా వెళ్తున్న ఆయన స్థానికంగా జరిగిన తీజ్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంతో కలిసి పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. గిరిజన యువతులు, మహిళలతో కలిసి సందడి చేశారు. గోధుమ నారు బుట్టలను ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రకృతిని ఆరాధించే పండుగ తీజ్ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, గిరిజన నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు నిద్ర సమస్యలను అధిగమించాలి

- సైకాలజిస్ట్ పున్నంచందర్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మరమగ్గాల కార్మికులు నిద్ర సమస్యలను అధిగమించాలని సైకాలజిస్ట్ పున్నంచందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని మైండ్‌కేర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్యనగర్‌లో మరమగ్గాల కార్మికులకు మనోవికాస సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నం చందర్ మాట్లాడుతూ మరమగ్గాల కార్మికులు రోజువారి కష్టమైన శారీరక శ్రమ, అనిశ్చిత జీవనశైలి కారణంగా నిద్రలేమితో బాధపడుతున్నారని, దీనివల్ల ఆందోళనలు, డిప్రెషన్ శారీరక అలసట, రక్త పోటు, మధుమేహంలాంటి వ్యాధులు వస్తాయని వాటిని అధికమించేందుకు సమస్యలను మరచిపోయి నిద్రపోవాలన్నారు. నిద్ర సమస్యలను నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తాయన్నారు. ప్రతిరోజు ఒకే సమయానికి నిద్రపోవడం, లేవడం అలవాటు చేసుకోవాలన్నారు. నిద్రపోయే ముందు మొబైల్, టీవీ వాడకాన్ని తగ్గించాలన్నారు. మైండ్ కేర్, కౌన్సెలింగ్ సెంటర్‌ను కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిందని దీనిని కార్మికులందరు సద్వినియోగం చేసుకోవాల ని సూచించారు.

ఈ కార్యక్రమంలో మైండ్‌కేర్ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది కొండ ఉమ, బూర శ్రీమతి, రాపెల్లి లత తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై కేటీఆర్ సన్నాయి నొక్కులు..

- యూరియా ఎవరి పరిధిలో ఉంటుందో తెలియదా.. - వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

ముస్తాబాద్, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరతపై మాజీ మంత్రి కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని.. పదేళ్ల మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు యూరియా ఎక్కడి నుంచి వస్తదో తెలియదా అని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముస్తాబాద్‌లో పోతుగల్ దారిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిని ఆది శ్రీనివాస్‌తో పాటు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. యూరియా కొరతపై కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని, కేంద్రం అందించాల్సిన యూరియా తెలంగాణకు సరిపడా యూరియాను ఎందుకు అందించడం లేదో, బీజేపీని ఎందుకు నిలదీయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే ఇప్పటివరకు 5.32లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చిందని 2.69లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఉందని అంకెల రూపంలో ఆది శ్రీనివాస్ వివరించారు. దీనిపై కేంద్రాన్ని ఎందుకు నీలదీయడం లేదో కేటీఆర్ తెలుపాలన్నారు. కేంద్రం తెలంగాణపైన కక్ష సాధింపు చర్యలుకు దిగుతుంటే బీఆర్ఎస్ ఆనందాన్ని వ్యక్తం చేస్తుందన్నారు. కేటీఆర్ ఇప్పటివరకు కేంద్రంపైన నోరు విప్పడం లేదన్నారు. కాంగ్రెస్ వ్యవసాయ శాఖ మంత్రి ఇప్పటివరకు అర డజను లేఖలు రాశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గత నెల రోజులుగా కేంద్రాన్ని యూరియా కేటాయింపుల పైన అడుగుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో యూరియా కోసం అందోళన చేశామన్నారు. ప్రియంకా గాంధీ స్వయంగా వచ్చి ఎంపీలు ఆందోళనలో పాల్గొన్నారని బీఆర్ఎస్ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. రైతులు కష్టపడుతుంటే ఎందుకు బీఆర్ఎస్ నాయకులు ఆనందిస్తున్నారని తెలంగాణపై మీకు ప్రేమలేదని విమర్శించారు. సాగుకు అనుగుణంగా ఇండెంట్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్రం అవలంబిస్తున్న వైఖరి కారణంగానే యూరియా కొరత ఏర్పడిందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని రైతులకు సరిపడా యూరియా సమకూర్చడం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సయ్య, పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కలకొండ లక్ష్మీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు యాదగిరిగౌడ్, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, భాను, శీల ప్రశాంత్, స్వేచ్ఛ, దీటి నర్సింలు, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం మండల రైతుల వినతి

ముస్తాబాద్ మండలంలోని పోతుగల్, మోయినికుంట, తెర్లుమద్ది, గన్నెవానిపల్లె రైతులు యూరియా కోసం విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి చేశారు. యూరియా లేక పంటలు పండే అవకాశం లేకుండా పోతుందని ఇప్పటికే ఆలస్యం అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి యూరియా ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడి నుండి వెంటనే తెప్పించి రైతులకు అందించాలని ఆదేశించారు.యూరియా కొరత జరగకుండా ప్రయత్నాలు చేస్తున్నామని రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

పొదుపు వైపు మళ్లింపు..

(5వ పేజీ తరువాయి)

ఆత్మస్థైర్యం దెబ్బతినడం వంటి సమస్యలను గుర్తించి స్వయం సహాయక సంఘాల్లో ఉన్న వృద్ధులకు భరోసా కల్పించే దిశగా సంఘాలు పనిచేసే విధంగా చేయనున్నారు. పది మందితో సంఘాలను ఏర్పాటు చేస్తారు.

కొత్త సంఘాల ఏర్పాటు ఇలా..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కిశోర బాలికలు, దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి నూతన సభ్యత్వ నమోదుతో కొత్త సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30లోగా కొత్త సంఘాల నిర్మాణం పూర్తిచేసే దిశగా కార్యాచరణ చేపట్టింది. కిశోర బాలికలను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల ద్వారా గుర్తిస్తున్నారు. దివ్యాంగులను ఓటర్ జాబితా, జాబ్ కార్డులు, సదరం సర్టిఫికెట్లు ద్వారా గుర్తిస్తారు. ఇప్పటికే కొందరు సంఘాల్లో ఉన్న వారిని మినహాయించి సంఘాల్లో లేని సభ్యుల వాస్తవ స్థితిని తెలుసుకుంటారు. వారి వివరాలను సెర్ప్ పోర్టల్‌లో నమోదు చేసి కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తారు.

ఈనెల 30 వరకు స్పెషల్ డ్రైవ్..

- చిదురాల శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో

కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులతో కొత్త ఎస్‌హెచ్‌జీ ఏర్పాటుచేసి అర్హులను చేర్చుకుంటాం. ఈనెల 30వరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించి జిల్లా సమైక్య, మండల సమైక్య కమిటీలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి : టీపీటీఎఫ్

ఇల్లంతకుంట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల బిల్లులను విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు పాఠశాలలో గురువారం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల రూ 700కోట్లు విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం మూడునెలలు గడిచిపోయినా కనీసం రూ 300కోట్లు విడుదల చేయలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల కృష్ణచైతన్య, మండలశాఖ అధ్యక్షుడు తూముకుంట రాంలింగారెడ్డి, సంఘ నాయకులు లొడ్డ శ్రీనివాస్, బాలగౌడ్, వెంకటహనుమాన్, గుంటి రవీందర్, కుమారస్వామి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

మహా ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ..



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెండింగిలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం చలో హైదరాబాద్ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుర్రం మల్లారెడ్డి, కామినేని శ్రీనివాస్, జక్కని నవీన్, గోలి రాజు, గడ్డం శంకర్, బోర్ల సత్యనారాయణ, నందాల శంకర్, ముస్కు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ ఎదుట ధర్నా..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 25న తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతంచేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ పిలుపునిచ్చారు. వీర్నపల్లి మండలకేంద్రంలో సంఘం మండల కమిటీ అధ్యక్షుడు వెంకట్ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మట్టి, సామగ్రి ధరలు పెరగడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులుపడుతూ పనులను నిలిపివేయడం వల్ల ఉపాధి లభించడం లేదన్నారు. కార్మికుల సమస్యల సాధన కోసం చేపట్టిన ధర్నాకు అధిక సంఖ్యలో తరలి రావాలని నరేందర్ కోరారు. సమావేశంలో నాయకులు రాజం, శంకర్, దేవయ్య, శ్రీనివాస్, ఎల్లం, రాజ ఎల్లయ్య, అంజయ్య, రవి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

బోయినపల్లి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ భుపేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరుశరాములు, మాజీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి, బీజేపీ మండల నాయకులు, బొంగాని అశోక్‌గౌడ్, జువ్వెత్తుల శ్రీనివాస్‌రెడ్డి, సారంపెల్లి రాజు తుమ్మనపల్లి కిరణ్, అమిరిశెట్టి గంగయ్య, బోగోజి గంగాధర్ చారి, మెరుపుల గంగాధర్‌గౌడ్, అమిరిశెట్టి అంజయ్య, రమేష్, సావనపల్లి అనిల్, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రోజురోజుకు సమస్యలు పెరిగిపోతున్నా పరిష్కారం కావడం లేదని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సమస్యలను వివరిస్తు గురువారం తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మ్యాకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, కొలనూరి ముత్తక్క, రొండ్ల మధుసూదన్‌రెడ్డి, మామిడి హరీష్, బత్తిని స్వామి, నాగసముద్రాల సంతోష్, చిమ్మనగొట్టు శ్రీనివాస్, లంకోజు చంద్రం, శ్రీనివాస్, అనీల్, కమలాకర్‌రావు, వేణుగోపాల్, వేణు, బాలరాజు, శ్రీహరి, కార్తీక్, రమేష్, దేవరాజు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో యూరియా కోసం రైతుల అవస్థలు తప్పడం లేదు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పదిర, బావుసింగ్‌నాయక్ తండాలో గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. పదిర గ్రామంలో రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. పక్కనే ఉన్న హరిదాస్‌నగర్ గ్రామంలోని రైతులు తరలిరావడంతో ఇరు గ్రామాల రైతుల మధ్య గొడవ చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని శాంతింపజేశారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం కొత్తపల్లి సింగిల్‌విండో వద్ద యూరియా కోసం రైతులు గురువారం పొద్దున్నే చెప్పులను వరుస క్రమంలో పెట్టారు. సాయంత్రానికి యూరియా వచ్చినా శుక్రవారం ఇస్తామని చెప్పడంతో రైతులు చేసేది ఏమిలేక వెనుదిరిగి వెళ్లిపోయారు.

కార్మికుల కూలి పెంపుపై యజమానుల మొండి వైఖరి..

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : టెక్స్‌టైల్ పార్క్‌లోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కూలి పెంపుపై యజమానులు మొండి వైఖరిని వీడి రోజుకు రూ.వెయ్యి కూలీ వచ్చే విధంగా నిర్ణయించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. టెక్స్‌టైల్ పార్క్‌లో కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా మూడో రోజు గురువారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్‌లోని నేతన్న విగ్రహం వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. నేతన్న విగ్రహానికి కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని అందించారు. అనంతరం నేతన్న విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న కార్మికుల కూలి పెంపుపై యాజమానులు మొండివైఖరిని వీడాలన్నారు. వెంటనే చర్చలు జరిపి కార్మికులకు ప్రభుత్వ, ప్రైవేటు వస్త్రాల కూలి పెంచి సమ్మెను విరమింపజేయాలని కోరారు. యజమానులు కూలి పెంచే విధంగా సంబంధిత చేనేత జౌళిశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. లేకుంటే కూలి పెంచే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు.



నేతన్న విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న కార్మికులు

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, శ్రీకాంత్, కిషన్, అంజనేయులు, సంపత్, వేణు, శ్రీధర్, వేణు, రాజు, మనోహర్, రాజశేఖర్, ప్రశాంత్, గణేష్, రామచంద్రం, కనుకయ్య, వరప్రసాద్, మహేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ప్రతీక

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సేవాలాల్‌తండాలో నృత్యం చేస్తున్న ఆది శ్రీనివాస్, కెకె మహేందర్‌రెడ్డి



మక్తానాయక్ తండాలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న గిరిజనులు



సీతారాంనాయక్‌తండాలో సంప్రదాయ దుస్తుల్లో గిరిజన యువతులు

ముస్తాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీక అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సేవాలాల్ తండాలో జరిగిన తీజ్ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు, కాంగ్రెస్ పార్టీ నియో జకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. తీజ్ ఉత్సవాల్లో భాగంగా సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంప్రదాయంగా తలపై గోధుమల మొలకల బుట్ట పెట్టిన బంజారా మహిళలతో కలిసి నృత్యం చేశారు. అంతకు ముందు విప్ ఆది శ్రీనివాస్, పార్టీ ఇంచార్జ్ కెకె మహేందర్‌రెడ్డిలను తండావాసులు సత్కరించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తలారి రాణి, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, భాను, శీల ప్రశాంత్, ఉచ్చిడి బాల్‌రెడ్డి మున్యానాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం(గోర్‌కట్మాలో)లో ఐదు తండాల సంయుక్త ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం బీవైనగర్, సంజీవయ్యనగర్, సాయినగర్ చంద్రంపేట, బంజార హిల్స్ తండాల సంయుక్త ఆధ్వర్యంలో తీజ్ నవరాత్రుల ముగింపు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ ఇంచార్జి అద్దంకి దయాకర్, నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి, సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో గిరిజనులు తీజ్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు, యువతులు, మహిళలు, యువకులు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ శివారులోని నీటి వనరులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంతోష్‌నాయక్, నాయకులు మహిపాల్‌నాయక్, గజన్‌నాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, సవాయినాయక్, జున్నునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలంలోని జగదాంబతండ, మక్తానాయక్ తండాల్లో గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో బాగంగా గోదుమ నారుతో పోసిన బతుకమ్మలను సంప్రదాయ నృత్యాలతో వెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున రెండు గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.



సిరిసిల్లలో తీజ్‌తో బాలికలు, యువతులు

పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో కృష్ణహరి, నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, నారాయణపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మోదీ కానుకలో భాగంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేటాయించిన సైకిళ్లను ఎంఈవో కృష్ణహరి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డిలు గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులను సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపల్లిలో వైద్యాధికారులు గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటా జ్వర సర్వే జరిపి పీడితులను గుర్తించారు. 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, సిబ్బంది లక్ష్మీప్రసన్న, స్వప్నాదేవి, పంచాయతీ కార్యదర్శి హరీందర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రుద్రంగి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రానికి చెందిన సిర్రం వెంకటి అనే వ్యక్తి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, మాజీ ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, మాడిశేట్టి ఆనందం, మంచె రాజేశం, కోడగంటి శ్యామ్, ఉప్పులుటి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ముస్తాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవునూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశలకు చెందిన 1982-83లో పదవ పూర్వ విద్యార్థులు రూ 40 వేల విలువగల వాటర్ ప్యూరిఫైయర్‌ను గురువారం బహూకరించారు. కేసీఆర్ మేనల్లుడు చీటి మధుసుధన్‌రావు మిత్రబృందం ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే మధుసుధన్‌రావు స్పోర్ట్స్ కిట్ ఇస్తానని, పాఠశాలలో స్టేజీ నిర్మాణానికి సహకరిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాముల స్వామి గౌడ్, లక్ష్మీనారాయణ, ఎఎపిసి చైర్మన్ జక్కుల పద్మ, మాజీ సర్పంచ్ బద్దిపడిగె భాను, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ఎంపీటీసీ సొల్ల లలిత, కాంప్లెక్ హెచ్‌ఎం రాజేశ్వరి, సీఆర్‌పి దేవరాజు, నక్కదాసిరి రవి, దాతలు ఆవునూరి రమణారావు, తడకమడ్ల శ్రీనివాస్, తొక్కు సత్యనారాయణ, దుంపటి రవీందర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బీడీ కార్మిక ఉపకార వేతనాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వం బీడీ కార్మిక ఉపకార వేతనాలను అందిస్తోందని జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్ అహ్మద్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని రైతు వేదికలో విద్యార్థుల తల్లిదండ్రులు, టేకేదారులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. పీఎఫ్ పత్రం కలిగి ఉన్న బీడీ కార్మికుల పిల్లలు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. టేకేదారులు ఇబ్బందులకు గురిచేయకుండా ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించనుందని అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్ అహ్మద్ అన్నారు. సమావేశంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి, ఏపీఎం నర్సయ్య, బీడి కార్మికులు, టేకేదారులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

చందుర్తి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అన్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ నియమాకంపై పార్టీ మండల నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. మండల నాయకులు శ్రీనివాసును ఘనంగా సన్మానించి గచ్చుబావి చౌరస్తా వద్దా టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పోంచెట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి పెరుక గంగరాజు, నాయకులు జీవన్, మహేందర్ రెడ్డి, జలందర్, శ్రీహరి, తిరుపతి, చింతకుంట శ్రీనివాస్, పెరుక రంజిత్, రమేష్, సురేష్, నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకంలో 'పనుల జాతర'

చందుర్తి,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం పనుల జాతరలో భాగంగా పనుల ప్రారంభోత్సవంతో పాటు నూతన పనులకు భూమి పూజ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధ, ఏపీవో రాజయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనులను శుక్రవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సుద్దాలలో ఫీవర్ సర్వే

కోనరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో గురువారం మండల వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఏఎన్ఎం సుజాత, ఆశావర్కర్లు జమున, పద్మ ఉన్నారు.

రోడ్డు మరమ్మతు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని స్థానికులు రోడ్డు మరమ్మతుకు నడుం బిగించారు. గురువారం స్థానిక ఓ ప్రైవేటు పెట్రోలు బంక్ ఎదుట బురదమయంగా మారిన రహదారికి మరమ్మత్తు పనులు చేశారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్ చంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ రవి, నాయకులు లింబాద్రి, బాలరాజు పాల్గొన్నారు.

వయ్యారి భామ కలుపు మొక్కపై అవగాహన

చందుర్తి,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో మహాత్మ జ్యోతిబాఫూలే వ్యవసాయ కళాశాల విద్యార్థినులు వయ్యారి భామ కలుపు మొక్క వల్ల మానవులకు, జంతువులకు, కలిగే ఆరోగ్య సమస్యలపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సరిత, వసంత, అశ్విత, మృణాళిని, హేమలత, శ్రీలక్ష్మి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మసీద్ ప్రారంభం..

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మదీనా మసీద్‌ను హైదరబాద్‌కు చెందిన దాత ఫతే అలీ ఇరానీ దంపతులు ప్రారంభించారు. ఫతే అలీ ఇరానీ దంపతులను మసీద్ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు పడిగెల రాజు, పెద్దూరి తిరుపతి, మసీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న నిర్వహించనున్న చలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయాలని గురువారం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్నా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి జిల్లా నాయకులు పర్కాల రవీందర్, అవురం సుధాకర్‌రెడ్డి, జంగిటి రాజు, వంగ తిరుపతి, ఎం తిరుపతి, మహేందర్ రావు, ఏ రమేస్, స్వామిగౌడ్, జీ సురేష్, టీ సురేష్, ప్రవీన్ పాల్గొన్నారు.